క్లుప్తంగా

తహసీల్దార్ సుందర్‌సింగ్‌కు సత్కారం



తహసీల్దార్ సుందర్‌సింగ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, ప్రజలు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా పనిచేస్తూ జీలుగుమిల్లికి బదిలీ అయిన జి.సుందర్‌సింగ్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల ప్రజలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పలు గ్రామాల్లో తిష్టవేసిన భూ సమస్యలను సుందర్‌సింగ్ పరిష్కరించారని అన్నారు. తిరుమలంపాలెంలో 41 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సత్వరమే పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బందితో పాటు ఉప్పే ధనుంజయరావు, గుడెల్లి వెంకట్రావు, బంటుమిల్లి బాలకృష్ణ, నిట్టా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఆడపడుచు వివాహానికి రూ.5 వేలు



వధువు తల్లి అమ్మాజీకి రూ.5 వేలు అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, జంగాలు, ముస్లీం మైనార్టీ కులాలకు చెందిన యువతుల వివాహానికి ప్రతి ఒక్క ఆడపడుచుకు పెళ్లికానుక కింద రూ.5 వేలు నగదును అందించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, ధర్మాజీగూడెం మాజీ సర్పంచ్, సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ×మన ఊరు ఆడపడుచు¥ అని ఆయన నామకరణం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం గ్రామానికి చెందిన ముళ్లపర్తి అమ్మాజీ కుమార్తె వివాహం సందర్భంగా ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ చేతుల మీదుగా రూ.5 వేలు అందజేశారు.

ఆశ వర్కర్లపై గురుతర బాధ్యత



పిప్పర పీహెచ్‌సీలో ఆశవర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ఆశ వర్కర్లది గురుతరమైన బాధ్యత అన్ని ఆశవర్కర్లు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. మంగళవారం పిప్పర పీహెచ్‌సీలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాలను నమోదు చేయాలని, బాల్యవివాహాలను అడ్డుకోవాలని, ఆరోగ్య అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించడం వంటి పనులు ఆశవర్కర్లు చేయాలని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వైద్యాఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి బాలు మాట్లాడుతూ ఆశవర్కర్లు కిలికిరి యాప్ ఉపయోగించే విధానాన్ని వివరించారు.

ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలి



చిలకంపాడులో ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందచేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులు చేసే కూలీలు రోజూ తప్పకుండా ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలని గణపవరం మండలం చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు అన్నారు. మంగళవారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలకు పిప్పర పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఓఆర్‌ఎస్ ద్రావణం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వృక్షాల తొలగింపు

ఉంగుటూరు: తల్లాపురం గ్రామంలో మంచి నీటి చెరువు పరిసరాల్లో ప్రభుత్వ భూమిలో పెరిగిన వృక్షాలను మంగళవారం తొలగించారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు పెంచాలని ఒక పక్క విస్తృత ప్రచారం చేస్తుండగా భారీగా పెరిగిన వృక్షాలను తొలగించడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ రైతు చెట్లను తొలగించి గట్టును తన చేలో కలిపేయడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఆర్వో శ్రీనివాసును ప్రశ్నించగా ఈ విషయంపై విచారిస్తామని తెలిపారు.

భానుడి ధాటికి విలవిల





నిర్మానుష్యంగా బుట్టాయగూడెం ప్రధాన రహదారి

ఎండ తీవ్రతతో నీడ కోసం పరుగులు తీస్తున్న మూగ జీవాలు →

బుట్టాయగూడెం : భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడంతో ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. మూగ జీవాలు సైతం అల్లాడిపోతున్నాయి. దీనికితోడు రుతుపవనాలు రావడం ఇంకా ఆలస్యం అవుతుందని ఎండల తీవ్రత మరి కొన్ని రోజులు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారుల ప్రకటలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. సాయంత్రం 6 గంటలైనా వేడి తగ్గకపోవడంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండల ప్రభావంతో మూగజీవాలు నీరు, నీడ కోసం అలమటించిపోతున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేని వారు వేడి నుంచి ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. జూన్ వారంలోనే 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్రమైన ఎండలు కాయడంతో రోహిణీకార్తిలో ఎండలకు ప్రజలు ఉక్కిబిక్కిరి అవుతున్నారు.

తీవ్రమైన ఎండలతో కష్టజీవుల బాధలు

మనం కొంచెం ఎండలోకి వెళ్లామంటే చాలు అల్లాడి పోతాం. బాబోయ్ ఇదేం ఎండరా అంటూ వెంటనే ఫ్యాన్లు, కూలర్లు వేసుకొని సేదతీరే ప్రయత్నం చేస్తాం. అయితే కష్ట జీవుల పరిస్థితి అలా కాదు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు వారివి. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా పని చేస్తేనే ఆ పూట ఇంట్లో పొయ్యి మీద కుండ ఎక్కేది. గత నాలుగు రోజులు ప్రచండ భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. భానుడి భగభగకు గ్రామాలు అల్లాడిపోతున్నాయి. విపరీతమైన వేడి ఉక్కపోత కారణంగా ప్రజలు ఉక్కిరి బిక్కిరైపోతున్నారు. ఉదయం నుంచే వేడిగాలులు వీయడంతో అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావడానికి భయపడుతున్నారు. గత వారం రోజులుగా బుట్టాయగూడెంలో సుమారు 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో రిక్షాపై సరుకులు వేసుకొని కొందరు, ద్విచక్ర వాహనాలపై వస్తువులను తీసుకెళ్తూ మరికొందరు కనిపిస్తున్నారు. ఎండలని బాధపడితే ఎలా పొట్టనిండాలంటే పనులు చేయాలి కదా అంటూ వారు సమాధానమిచ్చారు. కొంతమంది గొడుగులు వేసుకొని మరి కొంతమంది టవల్స్, ఖర్చీఫ్‌లు కట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు



సీఎం వైఎస్ జగన్‌ను కలిసి మాట్లాడుతున్న గంజిమాల రామారావు దంపతులు



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న వందనపు సాయిబాల పద్మ

కొయ్యలగూడెం : పోలవరం ప్రాజెక్టు పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్లు గంజిమాల దేవి రామారావు దంపతులు తెలిపారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపానని గంజిమాల దేవి అన్నారు. తనతో పాటు తన భర్త ఎంపీపీ గంజిమాల రామారావు పాల్గొన్నారన్నారు.

సీఎంను కలిసిన సాయిబాల పద్మ

జంగారెడ్డిగూడెం : పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రాజెక్టు వద్ద ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షులు వందనపు సాయిబాల పద్మ మర్యాపూర్వకంగా కలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం నుంచి నిధులు విడుదల తదితర విషయాలపై సీఎంకు శుభాకాంక్షలు తెలిపినట్లు సాయిబాల పద్మ తెలిపారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో మహిళా శక్తి నిర్విరామంగా కృషి చేసి పార్టీకి అఖండ మెజార్టీ సాధించే దిశగా కృషిచేయాలని సూచించినట్లు ఆమె పేర్కొన్నారు.

ఘనంగా చండ్ర రాజేశ్వరరావు జయంతి



చండ్ర రాజేశ్వరరావుకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చింతలపూడి : కమ్యూనిస్ట్ ఉద్యమ నేత, తెలంగాణ రైతు సాయుధ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు జయంతిని చింతలపూడిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి పలువురు సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.గురవయ్య మాట్లాడుతూ మతోన్మాద శక్తులపై లౌకిక వాద శక్తులను ఐక్యంగా ముందుకు నడిపిన ఘనత రాజేశ్వర్రావుకు మాత్రమే దక్కుతుందని అన్నారు. పేదల పక్షాన ఎన్నో ఉద్యమాలను ముందుండి నడిపారని కొనియాడారు. ప్రతి పేదవానికి భూమి ఉండాలని తలచారని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోడ వజ్రం, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పి.సోమశేఖరాచార్యులు, దొంత కృష్ణ, లాజరు, తొర్లపాటి రాజు, మెంతిన జ్యోత్స్న, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారి ఉత్సవ మూర్తితో క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 1,70,491 వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు మళ్ళీడి బాబి, దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పాల్గొన్నారు.

చదరంగంపై పట్టు సాధించాలి



భీమడోలులో చెస్ క్రీడలో శిక్షణ అందిస్తున్న చెస్ అసోసియేషన్ ఛీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ సాలూరి

భీమడోలు: విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే చదరంగంపై పట్టు సాధించాలని ఏపీ చెస్ అసోసియేషన్ చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ పాలూరి అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 30వ రోజైన మంగళవారం శిక్షణా తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులకు చదరంగం ఆటపై శిక్షణ అందించారు. చిన్నారులు నీతి కథలు చెప్పారు. పుస్తక సమీక్షలు రాసారు. చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ పాలూరి చదరంగం బేసిక్స్ నేర్పించారు. భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడారు. భీమడోలులోని చిన్నారులు యోగాసనాలు వేసి అబ్బుర పర్చారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్ గేదెల ఈశ్వరమ్మ చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, యోగా నిపుణులు కుర్రెళ్ల కిషోర్ యోగసనాలు నేర్పారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో చదరంగం పోటీలు

పెదపాడు : వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతన్నాయని పెదపాడు శాఖా గ్రంథాలయాధికారి జీ రాంబాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో 30వ రోజు చదరంగం, కంప్యూటర్ శిక్షణ, కేరమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడి యాచకుడి మృతి

భీమడోలు: భీమడోలు సంతమార్కెట్‌లో ఓ యాచకుడు మంగళవారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఈ ప్రాంతంలో కొన్నాళ్లుగా ఆయన యాచకుడిగా జీవిస్తున్నాడు. వేడి గాలుల తీవ్రత వల్ల వడదెబ్బ బారిన పడి అతడు మృతి చెందాడు. స్థానికులు పోలీసు లు, పంచాయతీ కార్యాలయానికి సమాచారం అందించారు. మృతుని వయస్సు 55 నుంచి 60ఏళ్ల లోపు ఉంటుందని, కాషాయం దుస్తులు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం



ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి మూలా నక్షత్రం సందర్భంగా మూడవ చండీ హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంకు చెందిన వేద పండితులు శ్రీ గండూరి సత్య కిరణ్, శ్రీనివాస్ చండీ హోమం అత్యంత వైభవంగా జరిపారు. ఈ చండీహోమంలో కమిటీ సభ్యులు గుడిమెట్ల యుగంధర్, మారిశెట్టి అంజన్ కుమార్, సూరిబాబు దంపతులు ఉభయధారులుగా వ్యవహరించారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహన్‌రావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాస్, యర్రం ఉదయ్‌కుమార్, జల్లేపల్లి శివకృష్ణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నూకాలమ్మ సన్నిధిలో...



జబర్దస్త్ అప్పారావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సినిమా షూటింగ్ జరుపుకుంటున్న అనన్య చిత్ర యూనిట్ నూకాలమ్మ ఆలయాన్ని దర్శించారు. అలాగే జబర్దస్త్ ఫేం అప్పారావు, లెక్చరర్ మర్రి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అప్పారావుకు వేద ఆశీర్వచనం అందజేసి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

సేవా సంస్థకు కూలర్ వితరణ

అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ, పిల్లల ఆశ్రమానికి నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ కూలర్ అందజేశారు. ఆశ్ర నిర్వాహకులు రోజారమణికి ఈ కూలర్ అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులు రాజాన పండుకు కృతజ్ఞతలు తెలిపారు.

నిడమర్రు ఎంపీడీవోగా విజయకుమారి



ఎంపీడీవో విజయకుమారికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు

నిడమర్రు: నిడమర్రు మండల ఎంపీడీవోగా జి. విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు, పూలదండలతో సత్కరించి ఆహ్వానించారు. విజయకుమారి ఇప్పటి వరకూ తిరుపతి జిల్లా వరదయ్యపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పని చేసి పదోన్నతి బదిలీపై నిడమర్రు వచ్చారు. ఇప్పటి వరకూ నిడమర్రు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పని చేసిన పీవీవీ ప్రకాష్ ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమారి మాట్లాడుతూ నిడమర్రు మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమెను మండల వైసీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, కార్యాలయ సిబ్బంది కిషోర్ కుమార్, కార్యదర్శులు బాలామణి, ఎం.పెద్దిరాజు, సునంద, విజయకుమార్, నరసింహస్వామి తదితరులు అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు.

అతిసార నియంత్రణ అవగాహన సదస్సు



వట్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో అతిసారపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెదపాడు: మండలంలోని వట్లూరులో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తల్లిదండ్రులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నెల 5 నుంచి 17వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టరు నాగేశ్వరావు వట్లూరు పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జింక్, ఓఆర్‌ఎస్ ద్రావణం ప్యాకెట్ల ఆవశ్యకతపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కే భారతి, ఎంపీహెచ్‌ఈఓ వీవీఎస్‌టీ కృష్ణారావు హెల్త్ సూపర్‌వైజర్ జీ రవికుమార్, ఏఎన్‌ఎంకే సుశీల, ఎమ్ఎల్‌హెచ్‌పీ సీమెచ్‌ఓ హరీష్ అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



రాములవారి విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉంగుటూరు: ఉంగుటూరు రామాలయం పునర్నిర్మాణం, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ పూజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. క్షీరాధివాసం, హోమాలు, ధాన్యాధివాసం తదితర పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ దీపాలంకరణ, రాములోరి కటౌట్లు ఏర్పాటు చేశారు.

మానవత సభ్యత్వ నమోదుకు కృషి

దెందులూరు: దెందులూరు మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు 500 సభ్యత్వ నమోదు లక్ష్యంగా తీర్మానం చేశామని సంస్థ మండల చైర్మన్ ఇరుకులపాటి సాంబశివరావు అన్నారు,. మంగళవారం మేధినరావుపాలెంలో సర్పంచ్ ఎస్.దుర్గాకుమారిరాజు నివాసంలో మానవత మండలి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు సంపంగి వేణుగోపాల్ తిలక్ మాట్లాడుతూ దెందులూరు మండలానికి ఫ్రీజర్ బాక్స్ వాహనం సమకూర్చామన్నారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలతో పాటు 500 సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ సుబ్బారావు, సంస్థ సభ్యులు తదితరులున్నారు.

రామాయణం, మహాభారతంపై క్విజ్ పోటీలు



ద్వారకాతిరుమల గ్రంథాలయంలో క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులకు రామాయణం, మహాభారతంలోని సారాంశాన్ని తెలియజేశారు. అనంతరం క్విజ్ పోటీలను నిర్వహించారు. అలాగే మన దేశంలో ఇతిహాసాలు, వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రాచీన భారత దేశ చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసి, వాటి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

ట్రక్కు బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తాపడ్డ ట్రక్కు

చింతలపూడి : చింతలపూడి మండలం తలార్లపల్లి వద్ద మంగళవారం కొబ్బరి బొండాల లోడుతో వెళ్తున్న ట్రక్కు ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. దీంతో ట్రక్కులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు స్థానికులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

చింతలపూడి : చింతలపూడి మండలం సమ్మెటవారిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆ యువకుడిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా చీపురుగూడెం గ్రామానికి చెందిన అజయ్‌గా గుర్తించినట్లు తెలిపారు.

పోతునూరులో మలేరియా మాసోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

దెందులూరు: మండలంలోని పోతునూరులో, గోపన్నపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నెలాఖరువరకు మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనారోగ్య పరిస్థితులు, లక్షణాలు గమనించిన వెంటనే సమీప వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు.

11న ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు

దెందులూరు: పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు దివంగత కాళ్ల నర్సింహరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కాళ్ళ శ్రావణ్‌కుమార్ ఒక్కొక్కరికి రూ.10 వేలు అందజేస్తారని నాగవంశం సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘ నాయకులు తెలిపారు. ఏలూరులో హేలాపురి టౌన్‌షిప్ కార్యాలయంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని ఈ కార్యక్రమానికి జిల్లాలోని నాగవంశీయులందరూ హాజరుకావాలని సంఘ నాయకులు కోరారు.